## బాధిత కుటుంబానికి ఎల్వోసీ అందజేత

### ఎమ్మెల్యే పల్లా సహకారంతో రూ. ఐదు లక్షల మంజూరు

బచ్చన్నపేట, నవంబర్ 14 : మండలంలోని కొన్నె గ్రామంలో కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న పసుల నాగమణికి చికిత్స నిమిత్తం రూ. 5 లక్షల ఎల్‌వోసీని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో మంజూరైంది. ఈమేరకు బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ గ్రామ నేత, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ గురువారం అందించారు. బాధితులు ఎమ్మెల్యే పల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిట్టల బాల్‌రాజు, అభినయ్, కనకరాజు, నర్సింహులు, నవీన్, మహేశ్ పాల్గొన్నారు.

రూ. 5 లక్షల ఎల్‌వోసీని అందిస్తున్న శివకుమార్‌గౌడ్

## 16 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

చిల్పూరు, నవంబర్ 14 : మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో నూతనంగా నిర్మించిన భక్త మార్కండేయ ఆలయంలో 16వ తేదీ నుంచి 18 వరకు స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు బుధవారం పద్మశాలి సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, చిల్పూరు మండల అధ్యక్షుడు గజ్జల దామోదర్, చిన్నపెండ్యాల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పేరాల రాజమౌళి, బత్తుల రాజన్ బాబు తెలిపారు. 16న గణపతి పూజ, 17న మహాహారతి, పద్మశాలి కులస్తులతో సామూహిక హోమం, 18న భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

## ప్రభుత్వ భూమి కబ్జాపై రెవెన్యూ విచారణ

పాలకుర్తి, నవంబర్ 14: పాలకుర్తిలోని సర్వే నంబర్ 393 ఏ, బీలోని ప్రభుత్వ భూమిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ గురువారం కొందరు దళితులు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన తహసీల్దార్‌ను విచారణకు ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ రాకేశ్, సర్వేయర్ విజయ్‌కుమార్ భూమిని పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు.

## స్టెనో/టైపిస్ట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, నవంబర్ 14: జనగామ జిల్లా కోర్టులో ఖాళీగా ఉన్న స్టెనో/టైపిస్ట్ పోస్టుకు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పోస్టుకు డిగ్రీ ఆర్ట్స్/సైన్స్/కామర్స్/లా ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. 2024 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి 34 ఏళ్ల లోపు ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా షార్ట్‌హ్యాండ్, టైప్ రైటింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా కోర్టు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు. దరఖాస్తులను పోస్టు లేదా కొరియర్ ద్వారా చైరన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు, జనగామ చిరునామాకు పంపించాలని తెలిపారు.

**పారా మెడికల్ డిప్లొమా కోర్సులో..**

జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా రెండేళ్ల పారా మెడికల్ డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సు (డీఎం ఐటీ), డిప్లొమా ఇన్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ కోర్సు (డీవోఏ)లో ప్రవేశానికి ఇంటర్మీడియట్ బైపీసీ లేదా ఎంపీసీ, ఇతర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మెడికల్ కళాశాల వెబ్‌సైట్ www.gmcjangaon.orgను పరిశీలించాలని కోరారు.

## బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

కొడకండ్ల, నవంబర్ 14: మండలంలోని మొండ్రాయి గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బేతి సోమయ్య, కునుకు ఉప్పలయ్య మృతి చెందగా, వారి కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సిందే రామోజీ, తదితరులు పాల్గొన్నారు.

బేతి సోమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి

జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

# బాలల హక్కులను కాపాడాలి

- వారి అభ్యున్నతికి కృషి చేయాలి
- జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ సెంటర్లలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నృత్యాలు, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలు స్కూళ్ల లో చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.**

*– జనగామ చౌరస్తా/జనగామ రూరల్/రఘునాథపల్లి/నర్మెట/స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట, నవంబర్ 14:*

నేటి బాలలే రేపటి పౌరులని, బాలల హక్కులను కాపాడడంతో పాటు వారి అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని బాల సదనంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతరం వివిధ సాంస్కృతిక పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ హాజరై బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి డీ ఫ్లోరెన్స్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి రవికాంత్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఉప్పలయ్య, మెంబర్ శ్రీలత, కవిత, బాల సదనం సూపరింటెండెంట్ వెరోనిక, ఎంఈవో రా జేందర్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఫాదర్ మరియ జోసెఫ్, ప్రభాకర్‌రెడ్డి, జైమోన్ థామస్, ఉపేందర్‌రెడ్డి, పీ శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వివిధ పాఠశాలల్లో..**

రఘునాథపల్లి మండలంలోని కోమాల్ల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం జాన్‌సుందర్, ఉపాధ్యాయులు సురేశ్, సంతోష్‌రెడ్డి, పుష్ప పాల్గొన్నారు. నర్మెటలో భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. , స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పగిడిపల్లి దామోదర్, రావుల రామ్మోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలోని జడ్పీ హైస్కూల్‌లో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం కౌడ రాజేందర్, ఉపాధ్యాయులు రుద్ర, లింగమూర్తి, గీరెడ్డి ప్రమోద్ రెడ్డి, రంజిత్, శ్రీనివాస్, సలావుద్దీన్, రవీందర్, మురళి, వీరబ్రహ్మం, కృపమ్మ, రవి, పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్సీ కాలనీలోని 3వ అంగన్‌వాడీ సెంటర్లో యువశక్తి యూత్ ఆధ్వర్యంలో పిల్లలకు జ్యూస్, పండ్లు అందించి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆర్ మాధవి, ఆయా ఎలేంద్ర, యూత్ సభ్యులు కరుణాసాగర్, ఏ నితిన్, ఎస్ అభిషేక్, ఎస్ అన్వేష్, కే నివాస్, సీహెచ్ చరణ్, ఆర్ రవీందర్, జే విజిత్, ఎం వరుణ్, ఎస్ నిశాంత్ పాల్గొన్నారు. నారాయణపూర్ పాఠశాల హెచ్ఎం ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో దాతలు సామల సందీప్‌రె డ్డి, అవనగంటి నవీన్ కుమార్, మాసపేట అంజన్‌రెడ్డి, దొంతిరి నర్సింహారెడ్డి, ఆర్కల తిరుపతి రెడ్డి, కల్లూరి నవీన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, శశిధర్‌రాజు, జీవనకుమారి ఆదేశ్‌లు కలిసి ప్రింటర్, ఐ ల్యాబ్ ఎండీ 20 వేల విలువ గల కంప్యూటర్, ఆంప్లిఫయిర్, రివాల్వింగ్ చెయిర్, కార్పెట్స్, అందించారు. గతంలో పని చేసిన ఉపాధ్యాయులు విద్యార్థులకు ట్రాక్ సూట్‌లు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు కమలమ్మ, మంజుల, ఉపాధ్యాయులు నర్సింహేలు, విద్యాశాఖాధికారులు నర్సింహారావు, తోట రాజు, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి దేవీప్రసాద్, పీఎస్ హెచ్ఎం భార్గవి, ఎంఈవో వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. బచ్చన్నపేట వాణి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బాస్కరుని సుమలత ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ వేషధారణల్లో అలరించారు. ఇటికాలపల్లిలో వెంకటేశ్వర్లు, రాధ, రమ, విజయలక్ష్మి, మడూరి వెంకటేశ్, సుంకోజు రజిత తల్లిదండ్రులు పాల్గొన్నారు. జనగామ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ కాంతులతో సోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం

# ముస్తాబైన ఆలయాలు

- నేడు కార్తీక పౌర్ణమి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జనగామ, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : హరి హరాదులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం పండుగ సందర్భంగా శివాలయాలతోపాటు విష్ణు దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు. హరిహరులిద్దరికీ కార్తీక పౌర్ణమి అత్యంత ప్రీతికరమైనది. ఈరోజున దీపదానం చేస్తే సకల పాపాలు తొలగి మోక్షం కలుగుతుందని భావిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున హరుడు త్రిపురాసురుడిని సంహరించినట్లుగా పురాణ శాస్త్రాలు చెబుతున్నాయి. దీన్ని స్మరిస్తూ మహిళలు శుక్రవారం తులసి చెట్టు వద్ద 365 ఒత్తులను నేతితో తడిపి దీపం వెలిగిస్తారు. శివాలయాల్లో తెల్లవారు జామున 4.30గంటలకు మహాన్యాస ఏకాదశ పూర్వక రుద్రాభిషేకాలతో పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. పర్వదినాన శివారాధన చేసే భక్తులు రోజంతా ఉపవాస దీక్షలు చేస్తూ ప్రదోషకాలంలో స్వామిని అభిషేకించి మారేడు దళాలతో పూజిస్తా రు. పాలకుర్తి సోమేశ్వరస్వామి, కొడవటూరు సిద్ధుల గుట్ట, జనగామ పాతబీటు బజార శ్రీ రామలింగేశ్వరస్వామి, బాణాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం, చీటకోడూరు పంచకోసు రామలింగేశ్వర, చిల్పూరు లక్ష్మీనర్సింహస్వామి తదితర ఆలయాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు.

**నేడు ఆఖండ జ్యోతి**

పాలకుర్తి: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం ఆఖండ జ్యోతిని నిర్వహించనున్నారు. ఆఖండ జ్యోతి కార్యక్రమం నిర్వహించే దేవస్థానాల్లో దేశంలోనే పాలకుర్తి క్షేత్రం మూడోది. అరుణాచలం, తిరువణ్ణమలై స్ఫూర్తితో పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆఖండ జ్యోతి వెలుగుతుంది. పాలకుర్తి ఆలయ గుట్టపై 8అడుగుల వెడల్పు, 4అడుగుల ఎత్తులో ప్రత్యేకంగా రూపొందించిన భారీ ప్రమిదలతో ఒక టన్ను నువ్వుల నూనె, ఆవు నెయ్యి, 2క్వింటాల్ల ముద్ద కర్పూరంతో ఆఖండ జ్యోతిని ప్రతి ఏటా వెలిగిస్తున్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో సాయంత్రం 5గంటలకు గిరి ప్రదక్షిణ ఆనంతరం ఆఖండ జ్యోతిని వెలిగిస్తారు. ఈ కార్యక్రమానికి ఉత్తర కాశీ పీఠాధిపతి శ్రీ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి, మంత్రి కొండా సురేఖ, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య తెలిపారు.

# ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, నవంబర్ 14: జిల్లాలో 18 ఏళ్లుపైబడిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక సారాంశ పున:శ్చరణ (ఎస్ఎస్ఆర్) 2025కి సంబంధించిన కీలక నవీకరణలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23, 24 తేదిల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 757982 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమానికి 505 కొత్త దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో 1067 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో 819 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. ఈ నెల 23న ముసాయిదా జాబితా విడుదల చేసి, డిసెంబర్ 12 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. జిల్లాలో సమగ్రమైన, కచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావెల రవి, భాస్కర్, విజయ్ భాస్కర్, జోగు ప్రకాశ్ పాల్గొన్నారు.

**పకడ్బందీగా గ్రూప్ 3 పరీక్ష నిర్వహించాలి**

గ్రూప్ 3 ప్రవేశ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో గ్రూప్ 3 పరీక్ష నిర్వహణపై అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, రూట్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లా కేంద్రంలోని (యశ్వంతాపూర్ సహా) 16 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షకు 5616 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. అరగంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఐడీ కార్డును తమ వెంట తెచ్చుకోవాలన్నారు. సందేహాలు నివృత్తి చేసుకునే వారు 9052308621 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు గోపీరామ్, వెంకన్న, ఏసీపీ పార్థసారథి, డీఈవో రాము, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణు మాధవ్, కలెక్టరేట్ ఏవో మన్సూరి, గ్రూప్ 3 పరీక్ష జిల్లా కన్వీనర్ డాక్టర్ నర్సయ్య పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం**

లింగాల ఘనపురం మండలం జీడికల్లులోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో వంశీ కలెక్టర్‌ను కలిసి శుక్రవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవం, తిరుకల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. స్థానిక ఉప్పలమ్మ ఆలయ ఈవో రాములు, మాజీ చైర్మన్ నర్సింహులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

**ఆశ కార్యకర్తల వినతిపత్రం**

రూ.18 వేత వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గురువారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు బీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తాడగోని రాధ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా జాబ్ చార్టులో లేని పల్స్ పోలియో, లెప్రసీ, బీపీ, షుగర్, ప్రభుత్వ పథకాల సర్వే పనుల్నీ ఆశాలతో నిర్బంధంగా చేయిస్తున్నారని తెలిపారు. ఆశ వర్కర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, సహజ మరణం, యాక్సిడెంట్‌లో మృతి చెందిన వారికి రూ.25 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ఆశ వర్కర్లు రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింగం, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రమా, విజయ, శోభ, శారద, సువార్త, వర్ష, పద్మావతి, అరుణ, నీలిమ, ఎలీషా, రమాదేవి, రజిత, జోత్స్న, మాధవి, రేణు, నీలా తదితరులు పాల్గొన్నారు.

## అప్పు చెల్లించడం లేదని.. వ్యక్తిపై కత్తితో దాడి

### అక్కడికక్కడే మృతి.. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

పరశురాములు(ఫైల్)

రఘునాథపల్లి, నవంబర్ 14 : తీసుకున్న అప్పు చెల్లించడం లేదని ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డిగూడెంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంపల పరశురాములు (36) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన పర్వత్ మహేందర్ తన ఇంటి నిర్మాణ బాధ్యతలు పరశురాములుకు అప్పగించగా, తన భార్య సంధ్యతో కలిసి పనులు చేసేవాడు. ఈ క్రమంలో సంధ్య అనారోగ్యానికి గురి కాగా మహేందర్ వద్ద అప్పు తీసుకొని, ఆ పిదప ఇంటి పనిచేసి తీర్చాడు. అయినప్పటికీ మహేందర్ ఇంకా డబ్బులివ్వాలని పరశురాములును ఇబ్బందులకు గురిచేసేవాడు. బుధవారం రాత్రి సుమారు 12.45 గంటలకు మహేందర్ ఫోన్ చేసి ఇంటికి రావాలంటూ బూతులు తిట్టడంతో పరశురాములు అతడి వద్దకు వెళ్లాడు. కోపంతో ఉన్న మహేందర్ తన వద్ద ఉన్న కత్తితో పరశురాములు తలమీద బలంగా నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా గురువారం ఘటనా స్థలాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ పరిశీలించారు.

**దోషులను కఠినంగా శిక్షించాలి**

పరశురాములు హత్యపై ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు కొయ్యడ మల్లేశ్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, మృతుడి కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దళిత సంఘాల నాయకులు ప్రముఖ వైద్యులు కృష్ణ, గిరి మల్ల రాజు, కందుకూరి ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఉపేందర్, మహాజన సోషలిస్ట్ పార్టీ జనగామ జిల్లా నాయకులు సుంచు రాజు, సందన రవీందర్, జేరిపోతుల సుధాకర్, గువ్వల రవి, బొట్ల మహేశ్, దర్శనాల రవి, మచ్చ అబ్బయ్య, తాల్లపల్లి ఎల్లయ్య, మచ్చ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## దవాఖానలో పండ్లు అందజేత

బచ్చన్నపేట, నవంబర్ 14: వాస్విక్ ఫౌండేషన్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని దవాఖానలో గురువారం పండ్లు, బ్రెడ్లు, ఫ్రూట్స్, రసాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో స్వీట్లు అందించారు. బండనాగారం, బచ్చన్నపేట, రామచంద్రాపూర్ గ్రామాల్లో కేక్‌లు కట్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆముదాల భూపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పృథ్వీరాజ్, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు జ్యూస్ అందిస్తున్న వాస్విక్ ప్రతినిధి భూపాల్‌రెడ్డి

## పాఠశాలలో వాటర్ బాటిల్స్ పంపిణీ

జనగామ రూరల్, నవంబర్14: మండలంలోని పసరమడ్ల గ్రామ శివారులోని చంపక్ హిల్స్‌లోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పోరిక అనసూర్య 250 వాటర్ బాటిల్స్ అందజేశారు. బాలుర దినోత్సవం సందర్భంగా అందించినట్లు హెచ్ఎం లచ్చిరాంనాయక్ తెలిపారు. కార్యక్రమంలో జనగామ, హనుమకొండ డీటీడీవో ప్రేమకళ, జనగామ జైలర్ పోరిక కృష్ణకాంత్, ఉపాధ్యాయులు వాసు, రతన్ సింగ్, జయరాం, సరోజన, స్వరూప, స్వాతి, రాములు, రాజయ్య, సారయ్య, పరమేశ్వర్, ఉపేందర్, హరిచంద్ పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మిక సంఘం కార్యవర్గం ఎన్నిక

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 14 : కల్లుగీత కార్మిక సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన మాచర్ల రఘురాములు అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా గట్టు రమేశ్, ఉపాధ్యక్షులుగా పొన్నం రంజిత్, మాచర్ల భిక్షపతి, మందపురం అంజయ్య, పంగ వేణు, ప్రధాన కార్యదర్శిగా పులి శ్రీనివాస్, కార్యదర్శిగా కత్తి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా బత్తిని రాజుతోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటయ్య పాల్గొన్నారు.

## ఉచిత గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరం

నర్మెట, నవంబర్ 14: మండలంలోని కన్నెబోయినగూడెంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి నేహ మాట్లాడుతూ శిబిరానికి 70 పశువులు రాగా 45 దూడలకు నట్టల నివారణ మందులు, 26 పశువులకు గర్భకోశ వ్యాధులను నిర్ధారణ చేసి చికిత్స అందించామన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఏ జైపాల్‌రెడ్డి, జేవీవో సుభద్ర, గోపాలమిత్రలు శ్రీనివాస్, నాగేష్, పశుమిత్ర శ్రీలత, విజయ డెయిరీ అధ్యక్షుడు నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

దేవరుప్పుల, నవంబర్ 14: సింగరాజుపల్లిలో గంజాయి సేవిస్తున్న యువకులు జోగు అర్జున్, రచ్చ చందును పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 50 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని పో